

ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్



పరిశుభ్రతతోనే ఆరోగ్యం

కలెక్టర్ టీఎస్ చేతన్.. స్వచ్ఛతాహి సేవ కార్యక్రమానికి శ్రీకారం

కొత్తచెరువు కూడలిలో అధికారులు, విద్యార్థుల మానవహారం

కొత్తచెరువు, సెప్టెంబరు 17: పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తేనే అందరూ ఆరోగ్యంగా ఉంటారని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో మంగళవారం స్వచ్ఛతాహి సేవ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా చేపట్టిన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి, ప్రారంభించారు. శ్రీకృష్ణదేవరరాయల సర్కిల్ మీదుగా నెహ్రూ కూడలికి ర్యాలీగా చేరుకున్నారు. అక్కడ మానవహారంగా ఏర్పడి, నినాదాలు చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులు, విద్యార్థులతో పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అన్ని శాఖల అధికారులు పారిశుధ్యానికి ప్రాధాన్యమివ్వాలన్నారు. కార్యాలయాలు, వాటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులు పరిశుభ్రత పాటించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ శివకుమారి, మండల ప్రత్యేకాధికారి శివరంగప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీటీ స్వాతి, పంచాయతీ కార్యదర్శి సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

పరిపాలన మీదా.. మీ భర్తదా..?

కొత్తచెరువులో మంగళవారం స్వచ్ఛతాహి సేవ కార్యక్రమ ప్రారంభోత్సవంలో వింత పరిణామం తలెత్తింది. కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ వచ్చారు. ఆయనను సన్మానించేందుకు స్థానిక గ్రామ పంచాయతీ సర్పంచ్ రాధ, ఆమె భర్త నాగరాజు వెళ్లారు. కలెక్టర్ మాట్లాడుతూ.. సర్పంచ్‌గా మీరు పరిపాలన చేస్తున్నారా, మీ భర్త చేస్తున్నారా అంటూ సర్పంచ్ రాధను ప్రశ్నించారు. మహిళా సర్పంచ్‌గా మీరు పరిపాలన చేస్తున్నట్లు లేదనీ, మీ భర్తే పరిపాలిస్తున్నట్లుగా ఉందన్నారు. ప్రస్తుతం ఏ కార్యక్రమం చేపడుతున్నామనీ, ఎవరెవరు అధికారులు వచ్చారని ఆమెను ప్రశ్నించారు. సర్పంచ్ తడబడ్డారు. కలెక్టర్ మాట్లాడుతూ.. మహిళలకు చట్టసభల్లో ప్రాధాన్యత కల్పించడం వెనుక ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్న ఉద్దేశం ఉందన్నారు. ఇప్పటి నుంచైనా సర్పంచ్‌గా పరిపాలన చేయాలని కలెక్టర్ సూచించారు. -కొత్తచెరువు



మహిళా సర్పంచ్‌ను ప్రశ్నించిన కలెక్టర్ → సర్పంచ్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్

దౌర్భాగ్యం..!



ట్రాక్టర్‌లో విద్యుత్‌స్తంభాలను తరలిస్తున్న దృశ్యం

పొలానికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలంటే మొదట రైతు విద్యుత్ స్తంభాలు, వైరు, వాటి రవాణా చార్జీలకు డబ్బు డీడీ రూపంలో చెల్లించాలి. ఆ తరువాతే వాటిని సరఫరా చేస్తారు. వాటిని పొలానికి తరలించి, అమర్చే బాధ్యత విద్యుత్ శాఖదే. అందుకు తగిన చార్జీలను అప్పటికే రైతు చెల్లించి ఉంటాడు కూడా. క్షేత్రస్థాయిలో పరిస్థితి అలా లేదు. రైతు రవాణా చార్జీలు చెల్లించినా.. మళ్లీ సొంత డబ్బుతో విద్యుత్ స్తంభాలు తరలించుకోవాల్సి వస్తోంది. అనుభవరాహిత్యంతో ట్రాక్టర్లలో తరలిస్తూ.. పలువురు ప్రమాదాల బారిన పడ్డారు. పలువురు ప్రాణాలు కోల్పోయారు కూడా. అయినా.. తప్పదు మరి. రవాణా చార్జీలు కట్టించుకున్న విద్యుత్ శాఖ చోద్యం చూస్తోంది. ఆ శాఖాధికారులు.. రైతులపై డబుల్ భారం పడుతున్నా కనీస కనికరం చూపట్లేదు. తాడిమర్రిలోని విద్యుత్ ఏఈ కార్యాలయం నుంచి ఇలా రైతు ట్రాక్టర్‌లో మండలంలోని మోదుగులకుంటకు మంగళవారం సొంత డబ్బుతో తరలించుకున్నాడు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, విద్యుత్ సామగ్రిని తరలించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

-తాడిమర్రి

మున్సిపల్ కమిషనర్ మాకొద్దు

వస్తే.. అడ్డుకుంటాం

తేల్చిచెప్పిన టీడీపీ శ్రేణులు.. మున్సిపల్ కార్యాలయం వద్ద భారీగా మోహరింపు



మున్సిపల్ కార్యాలయం వద్ద గుమికూడిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

ధర్మవరం, సెప్టెంబరు 17: గత వైసీపీ హయాంలో తమను ఇబ్బందులు పెట్టిన మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున మళ్లీ ఇక్కడికి వస్తే అడ్డుకుంటామని టీడీపీ నాయకులు తేల్చి చెప్పారు. ధర్మవరం కమిషనర్‌గా వారం క్రితం బాధ్యతలు చేపట్టిన మల్లికార్జునను ఇక్కడ విధులు నిర్వర్తించకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారు. బాధ్యతలు చేపట్టిన మరుసటి రోజే విజయవాడ వరదబాధితుల సహాయక చర్యల్లో పాల్గొనేందుకు వెళ్లారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయానికి కమిషనర్ వస్తారన్న సమాచారంతో వందలాది మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు అక్కడికి చేరుకున్నారు. సమాచారం అందుకున్న డీఎస్పీ శ్రీనివాసులు, వన్‌టౌన్, టూటౌన్ సీఐలు నాగేంద్రప్రసాద్, రెడ్డప్ప, ఎస్ఐలు, సిబ్బంది మున్సిపల్ కార్యాలయం వద్దకు చేరుకుని, ప్రత్యేక బందోబస్తు ఏర్పాటుచేశారు. పలువురు మున్సిపల్ కార్యాలయంలోకి వెళ్లడానికి ప్రయత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారు. టీడీపీ నాయకులు ఆందోళనను ఉధృతం చేయడంతో డీఎస్పీ శ్రీనివాసులు ఫోన్‌లో పరిటాల శ్రీరామ్, మున్సిపల్ కమిషనర్‌తో చర్చించారు. కమిషనర్ వస్తే శాంతిభద్రతలు దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కమిషనర్ రావట్లేదని చెప్పడంతో టీడీపీ నాయకులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పురుషోత్తంగౌడ్, చింతలపల్లి మహేశ్‌చౌదరి, తలారి చంద్రమోహన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలోకి వెళ్లడానికి ప్రయత్నిస్తున్న వారిని అడ్డుకుంటున్న డీఎస్పీ



ప్రమాదం చెంతన..!

యోగివేమన రిజర్వాయర్ నిర్వహణ అధ్వానం

గేట్ల మరమ్మతులకూ పైసా విదల్చని గత సర్కారు
గ్రీజు కూడా వేయలేని దుస్థితి
వరద వస్తే.. కొట్టుకుపోవడమే..
అన్నదాతల్లో ఆందోళన



సాగునీటికి ప్రధాన ఆధారమైన మండలంలోని యోగివేమన రిజర్వాయర్‌పై అన్నదాతలు కోటి ఆశలు పెట్టుకున్నారు. నీరు వస్తే.. ఆయకట్టు భూముల్లో పంటలు పెట్టుకోవాలని చూస్తున్నారు. కానీ నీరు వస్తే.. రిజర్వాయర్ ఏమవుతుందోనన్న ఆందోళన వారిని వెంటాడుతోంది. గత వైసీపీ ప్రభుత్వం ప్రాజెక్టు నిర్వహణను గాలికొదిలేయడమే ఈ దుస్థితికి కారణం. కనీసం గేట్లకు వేసేందుకు గ్రీజుకు కూడా పైసల్లేని దుస్థితి. టీఎంసీ సామర్థ్యం ఉన్న జలాశయంలో ప్రస్తుతం 0.26 టీఎంసీ మాత్రమే నిల్వ ఉంది. నిల్వ కనిష్ఠస్థాయికి పడిపోయింది. - ముదిగుబ్బ

యోగివేమన రిజర్వాయర్





యోగివేమన ప్రాజెక్టు కుడికాలువ

గేట్లు ఎత్తాలంటే చుక్కలే..

ప్రాజెక్టు పరిధిలో అభివృద్ధి పనులు, నిర్వహణ, మరమ్మతుల కోసం ప్రభుత్వం ఏటా రూ.20లక్షల నిధులివ్వాల్సి ఉంది. గత వైసీపీ హయాంలో మూడేళ్లపాటు పైసా కూడా విడుదల కాకపోవడంతో యోగివేమన ప్రాజెక్టు పరిస్థితి అధ్వానంగా తయారైంది. ప్రధానంగా 11 గేట్ల మరమ్మతులకు ఆయిల్, గ్రీజు, తుప్పు పట్టకుండా రంగులు వేసేందుకు తదితర మరమ్మతులకు నిధులు రాకపోవడంతో 5, 6, 7, 8 గేట్లు శిథిలావస్థకు చేరాయి. 5వ గేట్‌కు రోప్ తెగిపోయింది. 7, 8 గేట్ల మోటార్లు పనిచేయడంలేదు. కొన్ని గేట్లకు గేర్ వీల్స్ అలైన్‌మెంట్ పక్కకు జరిగింది. మిగిలిన గేట్లకు కూడా చిన్నచిన్న మరమ్మతులు చేయాల్సి ఉంది. దీంతో గేట్ల నుంచి నీరు లీకవుతోంది. వరద వచ్చి, గేట్లు ఎత్తాల్సి వస్తే అధికారులకు చుక్కలు కనిపిస్తాయి. ఏమవుతుందోనన్న ఆందోళన అధికార వర్గాల్లో నెలకొంది.

నిధుల కొరత

జలాశయం నుంచి కుడి, ఎడమ కాలువలు 38 కిలోమీటర్ల పొడవు ఉన్నాయి. కాలువల నిర్వహణకు నిధులు లేకపోవడంతో ముళ్ల చెట్లు పెరిగిపోయాయి. కల్వర్టు గోడలు దెబ్బతిన్నాయి. మట్టితో కూరుకుపోయి, తూములు దెబ్బతిని లైనింగ్ కొట్టుకుపోయింది. కాలువల్లో పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు నిండిపోవడంతో నీరు ముందుకు పారడం గగనంగా మారింది. జలాశయం కింద 12,300 ఎకరాల ఆయకట్టు భూములున్నాయి. నిధులు మంజూరు కాకపోవడంతో రైతన్నలు పంటలు సాగు చేసుకోవడానికి అవస్థలు పడుతున్నారు.

తప్పిన ప్రమాదం

2021 నవంబరులో నివార్ తుఫాన్ వర్షాలకు రిజర్వాయర్‌కు భారీ వరద వచ్చింది. జలాశయంలో నీటి నిల్వ గరిష్ఠ స్థాయికి చేరుకుంది. 5గేట్ల ద్వారా నీటిని విడుదల చేసినా ఇన్‌ఫ్లో ప్రమాదస్థాయికి చేరుకుంది. మరో రెండు గేట్లు ఎత్తేందుకు అధికారులు ప్రయత్నించారు. రెండున్నర అడుగులు పైకి ఎత్తిన తరువాత, అవి స్తంభించిపోయాయి. విద్యుత్ సమస్య తలెత్తడంతోపాటు జనరేటర్ పనిచేయక మూడు గంటలపాటు ప్రమాదస్థాయిలో 5 గేట్లపై నుంచి వరదనీరు ప్రవహించింది. తద్వారా గేట్లు తెరుచుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. 32వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ఏమాత్రం ఆలస్యమైనా గేట్లు కొట్టుకుపోయేవి.

ఉన్నతాధికారులకు నివేదిక పంపాం

గేట్ల మరమ్మతులకు సంబంధించి ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం. నిధులు మంజూరవగానే పనులు చేపడతాం. ఆయకట్టుకు సకాలంలో నీరిస్తాం.

- కృష్ణకుమార్, జేఈ, యోగివేమన ప్రాజెక్టు

మానవహక్కుల సంఘాల పేరుతో

మోసాలపై జాగ్రత్త

జాతీయ మానవహక్కుల కమిషన్ చైర్‌పర్సన్ విజయభారతి

కదిరిలీగల్, సెప్టెంబరు 17: మానవహక్కుల సంఘాలని చెప్పుకుంటూ వివిధ పేర్లతో ప్రజలను మోసం చేస్తున్న వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని జాతీయ మానవహక్కుల కమిషన్ చైర్‌పర్సన్ విజయభారతి పేర్కొన్నారు. న్యాయవాదుల విజ్ఞప్తి మేరకు స్థానిక సంఘ కార్యాలయాన్ని ఆమె మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొద్దిమంది హక్కుల సంఘాల పేరుతో మభ్యపెట్టి భారీగా డబ్బు గుంజే ప్రయత్నం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. జాతీయమానవ హక్కుల సంఘం.. ప్రజల నుంచి పైసా ఆశించకుండా వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. మానవహక్కులపై అందరికీ చైతనం అవసరమన్నారు. మానవహక్కులకు భంగం కలిగినపుడు కమిషన్ దృష్టికి తీసుకువస్తే న్యాయం చేస్తామన్నారు. అనంతరం న్యాయవాదులు.. ఆమెను ఘనంగా సత్కరించి, ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు రవీంద్రబాబు, కృష్ణమూర్తి, భైరవప్రసాద్, వెంకటేశు, శ్రీనివాసులు, రమేష్ పాల్గొన్నారు.



జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు


గురుకుల పాఠశాలల తనిఖీ

కదిరి అర్బన్: పట్టణంలోని గిరిజను గురుకుల పాఠశాలలను మంగళవారం జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) చైర్‌పర్సన్ విజయభారతి తనిఖీ చేశారు. అడపాల వీధి, డిగ్రీకళాశాల వద్ద ఉన్న పాఠశాలలను పరిశీలించారు. విద్యార్థులకు కల్పిస్తున్న వసతులపై ఆరాతీశారు. రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. గణితం, ఇంగ్లిష్‌కు సంబంధించి పలు ప్రశ్నలు అడగ్గా.. సరైన సమాధానం చెప్పకపోవడంతో సంబంధిత టీచర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీఈఓ మీనాక్షి, తహసీల్దార్ మురళి, ఎంఈఓ చెన్నక్రిష్ణ, ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

పంటలు ఎండుముఖం



చింతమానిపల్లి వద్ద ఎండుతున్న వేరుశనగ పంట..



మొలకెత్తని ఉలవ



ఎండిపోయిన కంది చెట్టు

గోరంట్ల, సెప్టెంబరు 17: తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా ఖరీఫ్ పంటలు ఎండుముఖం పట్టాయి. మరికొన్ని రోజులు వర్షం కురవకపోతే పంటలు వదులుకోవాల్సిందేనని అన్నదాతలు వాపోతున్నారు. ఖరీఫ్‌లో వర్షాధారంగా వేరుశనగ, కంది, మొక్కజొన్న, ఉలవలు, రాగి తదితర పంటలు సాగుచేశారు. తొలుత వర్షాలు బాగానే పడ్డాయి. ఆగస్టు 24 తర్వాత చినుకు జాడలేదు. వేరుశనగ వేర్లు దిగి, కాయలు ఏర్పడే కీలక దశలో వర్షం కురవలేదు. దీనికితోడు ఎండలు మండిపోతున్నాయి. వెరసి తక్కువగా కాసిన వేరుశనగ కాయలు కూడా నాసిరకంగా ఉన్నాయి. కంది కూడా ఎండిపోతోంది. కొంత మంది రైతులు ఉలవ సాగుచేసినా, నేలలో తేమ శాతం తక్కువగా ఉండడంతో మొకలకెత్తలేదు. మొలకెత్తినవి సైతం వర్షం లేక వాడిపోతున్నాయి.



ఉలవ మొలవలేదు: గొల్ల ఈశ్వరమ్మ, రైతు, కాంగారెడ్డిపల్లి

మూడు ఎకరాల్లో వేరుశనగ సాగుచేశా. రూ.60వేలు పెటుబడి పెట్టా. వేరుశనగ కాయలు ఏర్పడినా నెలరోజులుగా వర్షం లేక గొట్టికబారుతున్నాయి. వర్షంవచ్చినా ప్రయోజనంలేదు. ఐదెకరాల్లో 20రోజుల క్రితం ఉలవలు సాగుచేశా. తేమ తక్కువగా ఉండడంతో సరిగా మొలవలేదు. మొలచినా వర్షం లేక ఎండుముఖం పడుతున్నాయి. పెట్టుబడి ఖర్చుకూడా వచ్చే అవకాశం లేదు.



వేరుశనగతో నిండా మునిగా: రామమోహన్, రైతు, కాంగారెడ్డిపల్లి

రెండున్నర ఎకరాల్లో వేరుశనగ సాగు చేశా. రూ.20వేలు ఖర్చయింది. సొంత ఎద్దులతో వ్యవసాయం చేశా. వర్షం కురవక చెట్టుకు కాయలు ఏర్పడలేదు. పంట ఎండిపోతోంది. అంతర్‌పంటగా సాగుచేసిన కందిపంటకూడా ఎండుతోంది. వర్షం వస్తే పశుగ్రాసం దక్కే అవకాశముంది. లేదంటే అది కూడా దక్కదు. నిండా మునిగిపోయా.



ఈపంట నమోదు చేసుకోవాలి

వర్షం లేక పంటలు ఎండుముఖం పట్టాయి. వర్షం వస్తే ఉలవ ఇప్పుడైనా సాగుచేసుకోవచ్చు. ప్రతిరైతు ఈపంట నమోదు చేయించుకోవాలి.

-మునికృష్ణ, ఏఓ, గోరంట్ల

దిగుబడి తీయన.. ధర పుల్లన..!



కొర్రకోడు వద్ద విరగ్గాసిన ద్రాక్ష పంట

- విరగ్గాసిన ద్రాక్ష తోటలు
- పతనమైన ధరలు
- ఎగుమతి లేక ముఖం చాటేస్తున్న వ్యాపారులు
- తోటల్లోనే కుళ్లిపోతున్న పంట





కుళ్లిన కాయలను తొలగిస్తున్న కూలీలు



కుళ్లిపోతున్న ద్రాక్ష కాయలు

కూడేరు, సెప్టెంబరు 17 : సంప్రదాయ పంటలను వదిలి కొత్త ఒరవడితో ఉద్యాన పంటలు పండిస్తున్నా రైతులకు నష్టాలు తప్పడం లేదు. ద్రాక్ష సాగుచేసి దిగుబడి సాధిస్తున్నా మార్కెట్ లేకపోవడంతో వ్యాపారులు చెప్పిన ధరలకే విక్రయించాల్సి వస్తోంది. అనంతపురం జిల్లాలో చీనీ, మామిడి, టమోట వంటి పంటలు అమ్ముకోవడానికి మార్కెట్ సదుపాయం ఉన్నా.. ద్రాక్ష పంట అమ్ముకోవడానికి మార్కెట్ లేకపోవడంతో అన్నదాతలు విలవిలాడుతున్నారు. అనంతపురం జిల్లాలో 928.98 ఎకరాల్లో ద్రాక్ష సాగు చేస్తున్నారు. అందులో కూడేరు, కణేకల్లు, రాయదుర్గం, అనంతపురంరూరల్, రాప్తాడు, గార్లదిన్నె బెళుగుప్ప, నార్పల, ఆత్మకూరు, కుందిర్పి తదితర మండలాల్లో దిల్ కుషా (సీడ్) మానిక్ చమన్, సూపర్ సోనకా (సీడ్‌లెస్) రకాల ద్రాక్ష సాగు చేస్తున్నారు. ఇందులో ప్రధానంగా దిల్ కుషా ద్రాక్షను జిల్లాలో అత్యధికంగా కూడేరు మండలం కొర్రకోడు, జల్లిపల్లి, హసంపల్లి, తదితర గ్రామాల్లో పండిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 928.98 ఎకరాలు సాగు చేస్తుంటే.. అందులో కూడేరు మండలంలో 344.08 ఎకరాల్లో సాగు చేయగా.. రాప్తాడు మండలంలో 195.26 ఎకరాలు, బెళుగుప్ప 72.77 ఎకరాలు, అనంతపురం రూరల్ 63.07 ఎకరాలు, కణేకల్లు 50.12 ఎకరాలు, బుక్కరాయసముద్రం మండలంలో 37.58 ఎకరాలు, మిగిలిన మండలాల్లో కూడా అరకొరగా సాగు చేస్తున్నారు. కూడేరు మండలం కొర్రకోడు, జల్లిపల్లి గ్రామాల్లో ఒక్కొక్క రైతు రెండు నుంచి ఐదు ఎకరాల వరకు సాగు చేస్తున్నారు.

లక్షల్లో పెట్టుబడి.. వేలల్లో రాబడి

ద్రాక్ష పంట సాగు చేయాలంటే ప్రారంభం నుంచి లక్షల్లో పెట్టుబడి అవుతోంది. ఎకరా ద్రాక్ష సాగు చేయాలంటే రాళ్లు, కడ్డీలు పందిరితోపాటు సాగుకు దాదాపు రూ.4 లక్షల వరకు పెట్టుబడి వస్తోంది. పంట మొదలైనప్పటి నుంచి కోత దశ వరకు వాడే క్రిమిసంహారక మందులు, కూలీల ఖర్చులు తడిసిమోపెడవుతున్నాయి. ఈ ఏడాది ఎకరాకు 15 నుంచి 18 టన్నుల వరకు దిగుబడి వచ్చింది. సరైన ధర వస్తుందన్న ఆశతో ఉన్న సమయంలో పూర్తిగా పతనమయింది. లక్షల్లో పెట్టుబడులు పెట్టినా వేలల్లో కూడా ఆదాయం రాలేదని రైతులు వాపోతున్నారు.

ముఖం చాటేసిన వ్యాపారులు

జిల్లాలో పండిన ద్రాక్ష పంటను కొనుగోలు చేసిన వ్యాపారులు బూటాన్, బంగ్లాదేశ్ తోపాటు ఒడిషా, కోల్‌కతా, చెన్నై తదితర ప్రాంతాలకు ఎగుమతి చేసేవారు. బంగ్లాదేశ్‌తో భారతదేశానికి సరైన సంబంధాలు లేకపోవడంతో ద్రాక్ష పంట ఎగుమతులపై ప్రభావం పడింది. దీంతో ఇక్కడ పండిన పంటను ఇతర దేశాలకు ఎగుమతులు లేకపోవడంతో వ్యాపారులు కొనుగోలుకు మొగ్గు చూపడం లేదు. దేశంలోని పలు రాష్ట్రాలకు మాత్రమే పంట ఎగుమతి జరుగుతుండటంతో వ్యాపారులు ఎక్కువగా రాక ధర పూర్తిగా పడిపోయింది. గత సంవత్సరం టన్ను రూ.70 వేల నుంచి రూ.80 వేల వరకు ధర పలకగా.. ఈ ఏడాది టన్ను కేవలం రూ. 20వేల నుంచి రూ. 30 వేల వరకు పలుకుతోంది.

కుళ్లిపోతున్న పంట

ద్రాక్ష పంట వంద రోజులకే వస్తుంది. వందరోజులు దాటిన తర్వాత పంట అమ్ముకోలేక పోతే కుళ్లిపోతుంది. దిగుబడి ఎక్కువ రావడం, పంట ఎగుమతులు లేకపోవడతంతో కొనుగోలుకు వ్యాపారులు రావడం లేదు. రోజులు దగ్గర పడే కొద్దీ కాయలు కుళ్లిపోవడంతో అన్నదాతల్లో ఆందోళన ఎక్కువయింది. మరో పది రోజుల్లో పంటను అమ్ముకోలేకపోతే నష్టాలతో నట్టేట మునిగిపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



రెండు ఎకరాల తోటలో ద్రాక్ష సాగు చేశాను. పంట బాగా పండిన సమయంలోనే ధర పూర్తిగా పడిపోయింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ద్రాక్ష ధర పతనం కావడంతో అప్పుల పాలయ్యాను. పంట సాగుకు లక్షలు పెట్టుబడులు పెట్టి దిగుబడి బాగా వచ్చిన సమయంలో వ్యాపారులు ముందుకు రాలేదు. పండించిన పంటను ఏమి చేయాలో అర్థం కావడం లేదు. మమ్మల్ని ప్రభుత్వమే ఆదుకోవాలి.

- ప్రకాష్, కొర్రకోడు

పెట్టుబడులు కూడా రాలేదు



నేను సాగు చేసిన రెండు ఎకరాల ద్రాక్ష పంటను అమ్ముకోవడానికి నానాకష్టాలు పడుతున్నా. పంటను అమ్ముకోవడానికి మార్కెట్ లేకపోవడంతో వ్యాపారులు నిర్ణయించిన ధరకే ఇవ్వాల్సిన దుస్థితి నెలకొంది. రెండు ఎకరాలకు నాలుగు లక్షలు అప్పులు చేసి పెట్టుబడులు పెడితే.. చివరికి రెండు లక్షలు కూడా వచ్చే పరిస్థితి లేదు.

- పరుశురాం, కొర్రకోడు

భారీగా పెరిగిన పెట్టుబడులు



పోయిన సంవత్సరం ధర కొంచెం పెరిగింది. దీంతో ఈసారి రైతులందరూ సాగుకు సిద్ధం కావడంతో పెట్టుబడులు భారీగా పెరిగాయి. చెట్టు కటింగ్‌తోపాటు పలుసార్లు పనులు చేయించడానికి కూలీలు అవసరం కావడంతో ఖర్చులు పెరిగిపోయాయి. దీంతోపాటు క్రిమిసంహారక మందుల పెరగడంతో మరింత భారం పడింది. తీరా పంట అమ్ముకొనే సమయానికి ధర పడిపోవడంతో నష్టాలపాలయ్యాం.

- కుంటెన్న, కొర్రకోడు

కార్మికుల సమ్మె విరమణ

కలెక్టర్‌తో ఫలించిన చర్చలు

విధుల్లోకి సత్యసాయి, శ్రీరామిరెడ్డి నీటి సరఫరా కార్మికులు



కలెక్టర్‌తో చర్చలు జరుపుతున్న కార్మిక సంఘం నాయకులు

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 17: సత్యసాయి, శ్రీరామిరెడ్డి నీటి సరఫరా కార్మికులు మంగళవారం కలెక్టర్ వినోద్‌కుమార్‌తో జరిపిన చర్చలు సఫలమయినట్లు యూనియన్ గౌరవాధ్యక్షుడు ఓబులు తెలిపారు. 13 రోజులుగా చేపట్టిన కార్మికుల సమ్మెను విరమిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. బకాయి వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించేలా కలెక్టర్ హామీ ఇచ్చారని అన్నారు. క్వాలిటీ కంట్రోల్, క్వాలిటీ అసెస్‌మెంట్ ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలని, కార్మికుల అక్రమ తొలగింపు ఆపాలని, రాజకీయ ఒత్తిళ్ల నుంచి కార్మికులకు రక్షణ కల్పించాలన్న డిమాండ్లతో వారు నిరవధిక సమ్మెకు దిగారు. పలుమార్లు అధికారులతో జరిపిన చర్చలు విఫలం కావడం చివరికి కలెక్టర్‌తోనే చర్చలు జరిపారు. కలెక్టర్ కార్మికుల డిమాండ్ల పరిష్కారానికి సానుకూలంగా స్పందించడంతో సమ్మెను విరమిస్తున్నట్లు నాయకులు ప్రకటించారు. చర్చల్లో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, నగర కార్యదర్శి వెంకటనారాయణ, రామాంజి, సత్యసాయి వాటర్ వర్క్స్ కార్మికులు తిప్పేస్వామి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు ఈశ్వరయ్య, శ్రీరాములు, మధుసూదన్ ఆచారి, ప్రసాద్, లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఏబీఆర్‌లో తాగునీటి పథకాల పునరుద్ధరణ



తాగునీటి పంపులను ఆన్‌చేస్తున్న కార్మికుడు



నీటిని శుభ్రం చేస్తున్న దృశ్యం

కూడేరు, సెప్టెంబరు, 17: పీఏబీఆర్ డ్యాంలోని శ్రీరామిరెడ్డి, సత్యసాయి తాగునీటి పథకాలను పునరుద్ధరించారు. గత 13 రోజులుగా తాగునీటి కార్మికులు వేతనాల కోసం సమ్మెకు వెళ్లారు. మంగళవారం కలెక్టర్‌తో జరిగిన చర్చల్లో కార్మికుల డిమాండ్లను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. దీంతో పీఏబీఆర్ డ్యాంలోని తాగునీటి పథకాలకు కార్మికులు పంపులు ఆన్ చేసి నీటిని వదిలారు. దీంతో గ్రామాల్లో తాగునీటి సమస్య తీరినట్లయింది.

జాతీయస్థాయి ఖో-ఖో పోటీలకు ఎంపిక



స్వప్న




జ్యోతిరాం

ఉరవకొండ, సెప్టెంబరు 17: నియోజకవర్గంలోని ఉరవకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గడేహోతూరుకు చెందిన జ్యోతిరామ్, స్వప్న అనే విద్యార్థులు జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. ప్రకాశం జిల్లా, జె.పంగలూరులో ఈనెల 15న జరిగిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఆంధ్ర ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్‌జూనియర్ బాలురు, బాలికల పోటీలు నిర్వహించారు. జిల్లా జట్టు తరపున వీరు పాల్గొన్నారు. ఈ నెల26 నుంచి 30వ తేదీ వరకూ జార్ఖండ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని పీడీలు మారుతి, ప్రభాకర్ తెలిపారు.

ఆర్ఎంపీ వైద్యం వికటించి వ్యక్తి మృతి

పామిడి, సెప్టెంబరు 17: ఆర్ఎంపీ వైద్యం వికటించి పుల్లా ఆదినారాయణ(55) అనే వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలోని ఎద్దులపల్లిలో చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు... పుల్లా ఆదినారాయణ వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవారు. కొద్ది రోజులుగా అనారోగ్యానికి గురయ్యారు. మంగళవారం ఓ ఆర్ఎంపీని ఇంటికి పిలిపించుకొని ఇంజక్షన్ వేయించుకున్నాడు. ఆ సమయంలో భోజనం చేశావా అంటే అవునని అబద్ధం చెప్పినట్లు కుటుంబ సభ్యులు, స్థానికులు చెప్పారు. ఇంజక్షన్ వేసిన కొద్ది సమయానికే అపస్మారక స్థితిలోకి వెళ్తుండడంతో గమనించిన ఆర్ఎంపీ, కుటుంబ సభ్యులు అదే గ్రామంలోని పీహెచ్‌సీకి తీసుకువెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స నిర్వహించి పామిడి సీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. విషయం తెలుసుకున్న ఎద్దులపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుధాకర్ ఆ కుటుంబాన్ని కలిసి ప్రాథమికంగా విచారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు సిఫార్సు చేశామన్నారు. ఈ మృతిపై పూర్తిగా విచారించి వివరాలు వెల్లడిస్తామన్నారు. పోలీసులను వివరణ కోరగా.. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

పోలీసు సిబ్బంది కొరత తీర్చండి: ఎమ్మెల్యే



డీజీపీని కలిసిన కాలవ

రాయదుర్గం, సెప్టెంబరు 17 : జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు డీజీపీ ద్వారకా తిరుమలరావుకు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే మంగళవారం సాయంత్రం మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో డీజీపీ తిరుమలరావుని కలిశారు. సిబ్బంది కొరత వల్ల పోలీసులు విపరీతమైన పని భారాన్ని భరించాల్సి వస్తోందని తెలిపారు. కర్ణాటక సరిహద్దులో ఉన్న రాయదుర్గం నియోజకవర్గంలోని ఐదు పోలీస్‌స్టేషన్లలో కానిస్టేబుళ్ల కొరత అధికంగా ఉందన్నారు. ఫలితంగా సరిహద్దులో నిఘాతో పాటు ఇతర పోలీసు కార్యక్రమాలకు ఇబ్బందికరంగా మారిందన్నారు.

పుట్టపర్తి - బెంగుళూరు రైలు

అనంత వరకు పొడిగింపు

రైల్వేశాఖ మంత్రికి ఎంపీ కృతజ్ఞతలు

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 17 : పుట్టపర్తి - బెంగుళూరు ప్యాసింజర్ రైలును అనంతపురం వరకు పొడిగించినందుకు రైల్వే శాఖ మంత్రికి అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. గత పార్లమెంట్ సమావేశాల్లో జిల్లాకు చెందిన ప్రజల చిరకాల కోరికైన అనంతపురం వరకు పుట్టపర్తి - బెంగుళూరు ప్యాసింజర్‌ను పొడిగించాలని రైల్వే శాఖ మంత్రిని కోరినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో రైలును అనంతపురం వరకు పొడిగించినందుకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని అన్నారు.

టమోటా కిలో రూ.35

అనంతపురంరూరల్, సెప్టెంబరు 17: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.35తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మంగళవారం 3,150 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.28, కనిష్ఠ ధర రూ.17పలికినట్లు ఆయన తెలిపారు.

అన్న క్యాంటీన్ల ప్రారంభం వాయిదా

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 17: నగరంలో బుధవారం నిర్వహించాల్సిన మూడు అన్న క్యాంటీన్ల ప్రారంభోత్సవాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుధవారం విజయవాడలో సమీక్షాసమావేశాన్ని నిర్వహిస్తుండడంతో వాయిదా వేశామన్నారు. తిరిగి ఎప్పుడు ప్రారంభిస్తామన్న సమాచారాన్ని త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు.

కార్యదర్శిపై సర్పంచ్ భర్త దాడి

గంగినేపల్లిలో ఆలస్యంగా వెలుగులోకి..

పోలీసులకు ఫిర్యాదు.. కేసు నమోదు

ఖండించిన తోటి ఉద్యోగులు

చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు 17: విధి నిర్వహణలోఉన్న సచివాలయ కార్యదర్శిపై వైసీపీ సర్పంచ్ భర్త దాడి చేసిన సంఘటన చెన్నేకొత్తపల్లి మండలంలోని గంగినేపల్లిలో ఆలస్యంగా వెలుగు చూసింది. కార్యదర్శి, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఐ.రాము స్థానిక సచివాలయ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. స్థానిక సర్పంచ్ శాంతమ్మ భర్త రాజు, మామ పక్కీరప్ప శుక్రవారం సచివాలయానికి వెళ్లారు. గ్రామంలో పైపులైన్ లీకేజీ పనులు పూర్తి చేసినట్లు తీర్మానం ఇవ్వాలని కార్యదర్శిని అడిగారు. పనులకు సంబంధించి ఫొటోలు ఇవ్వాలని అడగ్గా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌కు ఇచ్చామని తెలిపారు. తనకు కూడా ఫొటోలు ఇవ్వాలని కార్యదర్శి అడగడంతో నానా దుర్భాషలాడారు. సీట్లో కుర్చొని తీర్మానం రాస్తుండగా తమ విధులకు ఆటంకం కల్గిస్తూ తోటి సిబ్బంది, గ్రామస్థుల సమక్షంలో సర్పంచ్ భర్త దాడికి దిగాడు. దీంతో కార్యదర్శి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై సోమవారం ఎంపీడీఓ గంగావతి, ఈఓఆర్‌డీ అశోక్‌నాయక్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. విధుల్లో ఉన్న తనపై దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కార్యదర్శి కోరారు. సర్పంచ్ జీతం విషయంలో కూడా ఆమె మామ పక్కీరప్ప చాలాసార్లు సచివాలయానికి వచ్చి ఇష్టానుసారంగా మాట్లాడుతారని కార్యదర్శి ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... సచివాలయ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సర్పంచ్ భర్త రాజుపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. కార్యదర్శి రాముపై దాడిని తోటి ఉద్యోగులు తీవ్రంగా ఖండించారు.

బద్రీనాథ్‌కు వెళ్లిన తాడిపత్రి వాసులు క్షేమం

ఫోన్‌లో యోగక్షేమాలు తెలుసుకున్న ఎంపీ అంబికా



బద్రీనాథ్ యాత్రలో చిక్కుకుపోయిన తాడిపత్రి వాసులు

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 17 : బద్రీనాథ్ యాత్రకు వెళ్లి తిరుగు ప్రయాణంలో కొండచరియలు విరిగిపడ్డంతో అక్కడే నిలిచిపోయిన తాడిపత్రి వాసులు సురక్షితంగా బయట పడ్డారు. ఈనెల 9న తాడిపత్రికి చెందిన 40 మంది బద్రీనాథ్ యాత్రకు వెళ్లారు. తాడిపత్రి నుంచి ఢిల్లీ దాకా రైలులో వెళ్లి.. అక్కడి నుంచి రెండు బస్సులను అద్దెకు తీసుకొని బద్రీనాథ్‌కు చేరుకున్నారు. తిరుగు ప్రయాణంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు బద్రినాథ్ గోశాల కొండచరియల ప్రాంతానికి చేరుకున్నారు. అప్పటికే కొండచరియలు విరిగిపడడంతో అక్కడి యంత్రాంగం ఎక్స్‌కవేటర్లతో తొలగింపు పనులు చేపట్టింది. అటువైపు వాహనాల రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. బుధవారం ఉదయం 11 గంటలకు వాహనాల రాపోకలను పునరుద్ధరించారు. ఈ పరిస్థితుల్లో దాదాపు 20 గంటలపాటు బస్సులోనే ఉండిపోవాల్సి వచ్చిందని తాడిపత్రికి చెందిన యాత్రికులు వాపోయారు. అక్కడ జరిగిన విషయాన్ని మంత్రి నారా లోకేశ్ క్యాంప్ ఆఫీస్‌కు తాడిపత్రికి చెందిన జనార్దన నాయుడు ఫోన్ ద్వారా తెలిపారు. స్పందించిన మంత్రి క్యాంప్ ఆఫీస్ అధికారులు, హోంశాఖ మంత్రి అనిత అక్కడి యంత్రాంగాన్ని సంప్రదించి తాడిపత్రికి చెందిన యాత్రికులను సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకున్నారు. అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ యాత్రీకులకు ఫోన్‌లో మాట్లాడి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తాము క్షేమంగా ఉన్నామని యాత్రికులు ఎంపీకి వివరించారు. ఢిల్లీలో యాత్రికులకు కావాల్సిన సదుపాయాలు కల్పిస్తామని ఎంపీ భరోసానిచ్చారు.

'నిధుల స్కాం' పై కలెక్టర్ విచారణ

ఏడు రోజుల్లో రిపోర్ట్ చేయాలని ఆదేశం

అనంతపురం విద్య, సెప్టెంబరు 17: జిల్లా సాధారణ పరీక్షల మండలి(డీసీఈబీ)లో నిధుల స్కాంపై విచారణకు తొలి అడుగుపడింది. కలెక్టర్ విచారణకు ఆదేశించారు. డీసీఈబీలో నకిలీ ఉత్తర్వులు సృష్టించి నిధులు స్వాహా చేస్తుండటంపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు వచ్చాయి. వీటిపై విచారణ చేయించాలంటూ కలెక్టర్ ఆదేశించారు. దీంతో జిల్లా విద్యాశాఖాధికారి విచారణకు దిగారు. గుత్తి డివిజన్ డిప్యూటీ డీఈఓతో విచారణ చేయించనున్నట్లు తెలిసింది. ఏడు రోజుల్లో విచారణ చేసి తనకు రిపోర్ట్ ఇవ్వాలన్న ఆదేశంతో విద్యాశాఖాధికారులు విచారణకు సిద్ధమయ్యారు.

లోగుట్టుగా స్కాం

జిల్లా విద్యాశాఖలోని డీసీఈబీలో భారీ స్కాం చోటుచేసుకుంది. 2023-24 విద్యాఏడాదికి సంబంధించిన ఎఫ్ఏ-3 ప్రశ్నాపత్రాలు, ఓఎంఆర్ షీట్స్ ముద్రణ, సప్లయికి సంబంధించిన భారీ అక్రమాలు చోటుచేసుకున్నాయి. జిల్లా విద్యాశాఖాధికారి వరలక్ష్మి అనంతపురం జిల్లాకు డీఈఓగా ఈ ఏడాది ఫిబ్రవరిలో వచ్చారు. ఆమె ఫిబ్రవరి 10న విధుల్లో చేశారు. డిసెంబరులోనే ఆమె పేరున కొన్ని ఉత్తర్వులు బయటకు వచ్చాయి. ఏకంగా రూ. 31.80 లక్షల వర్క్ ఆర్డర్ ఎఫ్ఏ-3 పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాల ముద్రణ, సప్లయికి సంబంధించి రెండు ప్రింటింగ్ వర్క్ ఆర్డర్స్ ఇచ్చారు. ఈ వర్క్ ఆర్డర్‌తో పాటు, క్వాలిటీ అష్యూరెన్స్ సర్టిఫికెట్స్ ఉత్తర్వులను జారీ చేశారు. అయితే విద్యాశాఖతో సంబంధం లేకుండా, ప్రాపర్ ప్రొసీజర్ లేకుండా సృష్టించిన్న ఈ ఉత్తర్వులపై అనేక విమర్శలు వస్తున్నాయి.

భవిష్యత్తు గురించి ముందే ఎలా తెలుసు..!

జిల్లా సాధారణ పరీక్షల మండలి కార్యదర్శిగా పురుషోత్తంబాబు పని చేస్తున్నారు. డీసీఈబీ కార్యకలాపాలన్నీ ఆయనే చూస్తుంటారు. డీసీఈబీకి చైర్మన్‌గా డీఈఓ ఉంటారు. అయితే డీఈఓగా వరలక్ష్మి జిల్లాకు ఫిబ్రవరిలో వచ్చింది. అయితే డిసెంబరు 15వ తేదీనే ఆమె పేరుపై ఉత్తర్వులు సృష్టించారు. రూ.31.80 లక్షల పనులకు సంబంధించిన వర్క్ ఆర్డర్, క్వాలిటీ అష్యూరెన్స్ సర్టిఫికెట్స్ ఉత్తర్వులన్నీ డీఈఓ పేరుపైన ఉన్నాయి. ఫిబ్రవరిలో ఫలాన వాళ్లు డీఈఓగా వస్తారంటూ డీసీఈబీ వాళ్లు భవిష్యత్తు ఊహించి ముందుగానే ఆమె పేరు ఉత్తర్వులు రెడీ చేయడం జిల్లా విద్యాశాఖ అధికారులనే విస్మయానికి గురిచేస్తోంది. రూ.31.80 లక్షల వర్క్ ఆర్డర్, ఇతర ఉత్తర్వులపై డీసీఈబీకి చైర్మన్‌గా వ్యవహరించే డీఈఓ సంతకం తప్పనిసరిగా ఉండాలి. అయితే ఈ ఉత్తర్వుల్లో డీఈఓ సంతకమే లేదు. కేవలం డీసీఈబీ కార్యదర్శి పురుషోత్తంబాబు సంతకం ఉండటం అనేక అనుమానాలకు తావిస్తోంది. విచారణ జరిగితే కానీ నిజాలు నిగ్గు తేలేలా లేవు. కాగా డీసీఈబీలో నిధుల స్కాం, ఫేక్ ఉత్తర్వులపై డీఈఓను ఆంధ్రజ్యోతి ఆరా తీసింది. ఫిబ్రవరిలో మీరు జిల్లాకు వస్తే డిసెంబరులోనే ఎలా ఉత్తర్వులు వచ్చాయి? అనిప్రశ్నించగా ఆ విషయం తనకు తెలియదన్నారు. కలెక్టర్ విచారణకు ఆదేశించారని స్పష్టం చేశారు. గుత్తి డిప్యూటీ డీఈఓను విచారణకు ఆదేశించారని తెలిపారు. వారం రోజుల్లో ఎంక్వయిరీ రిపోర్ట్ ఇవ్వాలంటూ ఆదేశించినట్టు తెలిపారు.

వైద్యకళాశాలకు మరో 50 ఎంబీబీఎస్ సీట్లు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 17 : అనంత మెడికల్ కళాశాలకు ఎన్ఎంసీ శుభవార్త అందించింది. అదనంగా మరో 50 ఎంబీబీఎస్ సీట్లు పెంచడమే కాక ఈ ఏడాది నుంచే అమలులోకి వచ్చేలా మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయాన్ని వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు మంగళవారం వెల్లడించారు. 2018-19లో 100 సీట్ల నుంచి 150 సీట్లకు పెంచగా, తాజాగా 150 సీట్ల నుంచి 200కు పెంచారని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం 2024-25 నుంచే ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరంలో 200 సీట్లకు అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటికే అడ్మిషన్లు మొదలయ్యాయని, పది రోజుల క్రితమే జాతీయ కోటా కింద ఏడుగురు, రాష్ట్ర కోటాకింద మంగళవారం 48 మంది మెడికల్ కళాశాలలో రిజిస్టర్ చేయించుకున్నారని తెలిపారు. గురువారం నాటికి తొలి అడ్మిషన్ల ప్రక్రియ ముగుస్తుందని చెప్పారు.

'పీఎం విశ్వకర్మ'ను సద్వినియోగం చేసుకోండి

కలెక్టర్ వినోద్‌కుమార్

ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు 17 : జిల్లాలోని అర్హులైన ప్రతి ఒక్కరూ పీఎం విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం విశ్వకర్మ జయంతిని పురస్కరించుకొని రాణీనగర్‌లోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. కార్యక్రమానికి కలెక్టర్ వినోద్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ముందుగా కల్యాణమండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీసీ వసతిగృహ విద్యార్థినులు నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... విశ్వకర్మ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమానికి 'పీఎం విశ్వకర్మ' అని పేరుపెట్టారని తెలిపారు. పనుల ఆధారంగా రాష్ట్రంలో 18 రకాలైన చేతివృత్తుల వారిని గుర్తించారని, వారికి ఆర్థికసహాయం అందించేందుకు పీఎం విశ్వకర్మ పథకాన్ని ప్రారంభించారని అన్నారు. ఈ పథకం కింద ఎంపికై ప్రాథమిక శిక్షణ పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు రుణ సౌకర్యం అందిస్తామన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ డీడీ కుష్బూకొఠారీ, తహసీల్దార్ హరిబాబు, వార్డెన్ల సంఘం జిల్లా అధ్యక్షుడు మారుతీప్రసాద్‌తో పాటు విశ్వకుల పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జీడిపల్లికి 934 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, సెప్టెంబరు 17: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు మంగళవారం కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 934 క్యూసెక్కుల ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 906 క్యూసెక్కులు, పీఏబీఆర్‌కు మరువ నుంచి 25 క్యూసెక్కులు వెళుతున్నట్లు పేర్కొన్నారు.

నీటి సమస్య పరిష్కారం కోసం నిరసన



రోడ్డుపై నిరసన తెలుపుతున్న ఎస్సీ కాలనీ వాసులు

బత్తలపల్లి, సెప్టెంబరు 17: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు మంగళవారం నాలుగురోడ్ల కూడలిలో నిరసన తెలిపా రు. గత నెల రోజులుగా కాలనీకి నీరు రాక పోవడంతో నిరసనకు దిగినట్లు తెలిపారు. అక్కడే ఉన్న ఏఎస్ఐ సోమశేఖర్ నీటి సమస్య ఉంటే అధికారులను ప్రశ్నించాలి గాని ఇలా రోడ్ల మీద ధర్నా చేసి ప్రజలకు ఇబ్బందులకు గురి చేయకూడదని వివరించారు. దీంతో నిరసనకారులు అక్కడి నుండి ఎంపీడీఓ కార్యాలయం వద్దకు సీపీఐ కాటమయ్యతో కలిసి వెళ్లి నిరసన తెలిపారు. ఈఓఆర్డీ దివాకర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ వరలక్ష్మి బయటకు వచ్చి నిరసనకారులతో సమస్య గురించి చర్చించారు. గత నెల రోజులుగా నీరు రాకున్న ఏ ఒక్క అధికారి కాని, సర్పంచులు కాని తమ సమస్య పట్టించుకోలేదని వారు అధికారుల ఎదుట వాపోయారు. మీ ఇళ్లల్లో నీరు రాకుంటే ఇలానే ఉంటారా అని ప్రశ్నించారు. వీలైనంత త్వరలో మీసమస్యను పరిష్కారిస్తామని అధికారులు వారికి హామీ ఇచ్చారు. దీంతో నిరసనకారులు ఆందోళన విరమించారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అబ్దుల్‌నబీ

ధర్మవరంరూరల్, సెప్టెంబరు17: మండలంలోని రావులచెరువు గ్రామంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం అంగన్‌వాడీ, ప్రభుత్వ ఎంపీయూపీ, జడ్పీహైస్కూల్ పాఠశాలలోని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అబ్దుల్‌నబీ హాజరై విద్యార్థులకు మాత్రలు వేశారు. విద్యార్థులందరూ తప్పనిసరిగా ఈ మాత్రలు వేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు.

కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మహేశ్వర్, పంచాయతీ సెక్రటరీ యల్లప్ప, వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీధర్, ఎంఎల్‌హెచ్‌పీ పరిమళ, ఏఎన్‌ఎం రేణుక, ఆశావర్కర్ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం: కలెక్టర్



చిన్నపల్లి జడ్పీ హైస్కూల్‌లో ఆల్బెండజోల్ మాత్రలను వేస్తున్న జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్



ఇంటి తాళాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి

పుట్టపర్తి, సెప్టెంబరు 17: ఆరోగ్యమే మహాభాగ్యమని,విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ సూచించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక చిన్నపల్లి జడ్పీహెచ్ స్కూల్‌లో విద్యార్థులకు ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డితో కలిసి ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1 నుంచి 19 సంవత్సరాలు వయస్సు కలిగిన బాలబాలికలు 3.81లక్షలమంది ఉన్నారని ఇందులో 96.98శాతం మందికి ఆల్బెండజోల్ మాత్రలను వేసినట్లు తెలిపారు. మిగిలిన వారికి ఈనెల 20న ఆల్బెండజోల్ మాత్రలు వేస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే వ్యక్తిగత పరిశుభ్రత, విటమిన్ ఏ బీ సీ డీ ఈల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ పీఎస్ మంజువాణి, మెడికల్ ఆఫీసర్ కేసీకే నాయక్, హెచ్‌ఎం ప్రభావతి పాల్గొన్నారు.

ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 ప్రారంభం

పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకే ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.0ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. ఒడిశాలోజరిగిన పీఎంఏవై కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లోని వీడియోకాన్ఫరెన్సును కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే సింధూరరెడ్డి, అధికారులు వీక్షించారు. అనంతరం జిల్లాకేంద్రంలోని 14, 15 వార్డులలో పీఎంఏవై కింద ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు ఇంటితాళాలు అందచేశారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ వెంకటనారాయణ, డీఈ రమణారెడ్డి, మునిసిపల్ ఛైర్మన్ తుంగ ఓబులపతి, కమిషనర్ ప్రహ్లాద, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో అంబులెన్స్ డ్రైవర్‌కు గాయాలు

తనకల్లు, సెప్టెంబరు 17: మండలంలోని చీకటిమానుపల్లి వద్ద మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో తిరుపతికి చెందిన అంబులెన్సు డ్రైవర్ బాబ్‌జాన్ తీవ్రంగా గాయపడ్డాడు. వందే మాతరం టీమ్ సభ్యులు గాయపడిన బాబ్‌జాన్‌ను మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. తిరుపతికి చెందిన అంబులెన్స్ డ్రైవర్ మృతదేహాన్ని తిరుపతి నుంచి తనకల్లు మండలంలోని కొక్కంటిక్రాస్‌కు తీసుకు వచ్చారు. తిరుగు ప్రయాణంలో తిరుపతికి వెళ్తుండుగా, గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో, అంబులెన్స్ డ్రైవర్ బాబ్‌జాన్ చేయి నుజ్జు నుజ్జు అయింది. గాయపడిన బాబ్‌జాన్‌ను మదనపల్లికి తరలించారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

బుక్కపట్నం, సెప్టెంబరు 17: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు చుట్టు పక్కల ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ నాగలక్ష్మీ రాజు, ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని శివాలయం వీధిలో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే పలు వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. అక్కడక్కడ పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని శుభ్రం చేయించారు. ఈకార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది వెంకటేశ్వర్లు, రమేష్ తదితరులున్నారు.

ఆర్టీసీ బస్టాండులో సమస్యల పరిష్కారం

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

ధర్మవరం, సెప్టెంబరు 17: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ అధికారులలో చలనం వచ్చింది. బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలను డిపో మేనేజర్ సత్యనారాయణరావు పరిష్కరించారు. ఈనెల 15న సమస్యల బస్టాండ్ శీర్షికన ఓ కథనం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైంది. దీనికి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి స్పందించి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా బస్టాండ్‌లో సౌకర్యాలను కల్పించాలని ఆర్టీసీ ఉన్నతాధికా రులకు ఆదేశాలు ఇచ్చినట్టు అధికారులు తెలిపారు. దీంతో అధికారులు ఆర్టీసీ బస్టాండ్‌లో తాగునీరు, లైట్లు ఏర్పాట్లు చేయడంతో పాటు బస్టాండ్ పరిసర ప్రాంతాలు శుభ్రం చేయించారు. రాత్రి సమయంలో చివరి బస్సు వెళ్లేంతవరకు విచారణ కేంద్రంలో సిబ్బందిని నియమించారు. మరుగుదొడ్లకు తాళాలు వేయకుండా చర్యలు చేపట్టారు. దీంతో ప్రయాణికులు 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



1. బస్టాండ్ ఆవరణలో శుభ్రం చేసిన దృశ్యం
2. రాత్రి సమయంలో బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన లైట్లు

గ్రామాల ప్రశాంతతకు కృషి
- డీఎస్పీ శ్రీనివాసులు

బత్తలపల్లి, సెప్టెంబరు 17: గ్రామాలు ప్రశాంతంగా ఉండేందుకు కృషి చేస్తున్నామని, ఇందుకు అందరు సహకరించాలని డీఎస్పీ శ్రీనివాసులు కోరారు. మండలంలోని యర్రాయపల్లి గ్రామంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ప్రజలతో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామాలలో ఏదైనా సమస్య వస్తే గొడవలు చేసుకోకుండా ఆ సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని తెలిపారు. గ్రామాలు ప్రశాంతగా ఉంటే ఆగ్రామాలలో ప్రజలు అభివృద్ధి చెందుతారన్నారు. ఆ గ్రామాలలోని విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత శిఖరాలకు ఎదుగుతారన్నారు. గ్రామాలలో గొడవలు సృష్టించే వారి పట్ల పోలీస్ శాఖ కఠినంగా వ్యవహరిస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ ప్రభాకర్, ఎస్ఐ శ్రీనివాసులు, టీడీపీ నాయకులు చల్లా శ్రీనివాసులు, రామానాయుడు తదితరులు పాల్గొన్నారు..

స్వచ్ఛ ధర్మవరంగా తీర్చిదిద్దుతాం: టీడీపీ



రోడ్లను శుభ్రం చేస్తున్న టీడీపీ, బీజేపీ నాయకులు తదితరులు

ధర్మవరం, సెప్టెంబరు 17: పట్టణాన్ని స్వచ్ఛ ధర్మవరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, బీజేపీ నాయకులు హరీశ్ పిలుపు నిచ్చారు. పట్టణంలోని గాంధీనగర్‌లో మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని టీడీపీ, బీజేపీ నాయకులు, మున్సిపల్ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేజ్ సర్కిల్ నుంచి కళాజ్యోతి, ఎన్టీఆర్ సర్కిల్‌మీదుగా ర్యాలీగా వెళ్లి గాంధీనగర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం రోడ్లను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ ఇళ్ల పరిసరాలను శుభ్రం చేసుకుంటే రోగాలు దరిచేరవన్నారు. ఇళ్లలోని మురికి నీటిని రోడ్లపై పారవేయరాదని, చెత్తను కూడా కుండీలో వేయాలని సూచించారు. అనంతరం బీజేపీ నాయకులు స్థానిక ప్రభుత్వాస్పత్రిలో మోదీ జన్మదినం సందర్భంగా రోగులకు పండ్లు, బ్రెడ్లను పంపిణీ చేశారు. ధర్మవరం రైల్వేస్టేషన్‌లో ఎస్ఎం చల్లా నరసింహనాయుడు ఆధ్వర్యంలో రైల్వేఅధికారులు, సిబ్బంది స్వచ్ఛత హీ సేవా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ ప్రధానకార్యదర్శి పురుషోత్తంగౌడ్, నాయకులు భీమనేని ప్రసాద్‌నాయుడు, చీమలరామాంజి, బీజేపీ నాయకులు గుండాపుల్లయ్య, సాకే ఓబుళేశు, చంద్ర, రామాంజినేయులు, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్యామ్సన్, కేశవ, ఏఈ ప్రతాప్ పాల్గొన్నారు.

తల్లిదండ్రులే మీ హీరోలు

ప్రతి విద్యార్థి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

నల్గొండ జిల్లా అదనపు కోర్టు న్యాయాధికారి దుర్గాప్రసాద్

హిందూపురం, సెప్టెంబరు 17 : మీ జీవితాలకు మీ తల్లిదండ్రులే హీరోలని తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా అదనపు కోర్టు న్యాయాధికారి దుర్గాప్రసాద్ అన్నారు. మంగళవారం ఎస్‌డీజీఎస్ కళాశాలలో పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీజె మాట్లాడుతూ తాను పేద కుటుంబం నుంచి వచ్చానని, జీవితంలో ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగడంవల్లే కష్టపడి జడ్జిస్థాయికి ఎదిగానని అన్నారు. మీరుకూడా ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. జీవితమంతా కొంతమంది ఇతరుల జీవితాలతో పోల్చుకుంటారని, లేదా ఇతరుల అంచనాలకు అనుగుణంగా ప్రవర్తిస్తారని తెలిపారు. ప్రతి విద్యార్థికి మార్గదర్శకం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులే అన్నారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థి దశలో తప్పటడుగులు వేస్తే జీవితం నరకప్రాయంగా మారుతుందన్నారు. ఏదైనా నేరం చేసి కేసు నమోదైతే చదువు, ఉన్నతస్థాయి ఏదీ దక్కదన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాగేంద్రకుమార్, వన్‌టౌన్ సీఐ రాజగోపాల్‌నాయుడు, కళాశాల కమిటీ అధ్యక్షుడు వేమూరి చంద్రమోహన్, ప్రిన్సిపాల్ ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయాధికారి దుర్గాప్రసాద్

ఇదేమి విచారణ..?


టీ స్టాల్‌వద్ద శ్రీరామిరెడ్డిని విచారిస్తున్న అధికారి


టీ స్టాల్ వద్ద విచారణ చేపట్టిన అధికారి గురించి వివరిస్తున్న బాధితుడు

హిందూపురం(సోమందేపల్లి), సెప్టెంబరు 17 : కొద్దిరోజుల క్రితం సోమందేపల్లి పీహెచ్‌సీ పరిధిలోని 104లో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న శ్రీరామిరెడ్డి ఉన్నతాధికారి వేధింపులను భరించలేక ఆత్మహత్యకు యత్నించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం విచారణ చేయడానికి వచ్చిన జిల్లా అధికారి శంకర్ ఓ టీ స్టాల్ వద్దకు పిలిపించి విచారించడం పలు విమర్శలకు తావిస్తోంది. శ్రీరామిరెడ్డి 104లో గత ఐదేళ్లుగా విధులు నిర్వహిస్తున్నాడు. ఓఈ రామక్రిష్ణ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి అయిన తనను వేధింపులకు గురిచేశారని సెల్ఫీ వీడియో తీసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. ఈ విషయంచర్చనీయాంశంగా మారడంతో విచారణ చేపట్టడానికి వచ్చిన అధికారి ప్రభుత్వ ఆసుపత్రిలో కాకుండా ఓ టీ స్టాల్ వద్దకు పిలిపించి విచారించడంపట్ల బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. విచారణ చేపట్టిన విధానం అధికారి ప్రవర్తనపై అసంతృప్తి వ్యక్తం చేశాడు. తాను తప్పు చేసి ఉంటే తనపై చర్యలు తీసుకోవాలని, లేదంటే వేధింపులకు గురిచేసిన అధికారిపై చర్యలు తీసుకోవాలని కోరాడు.

తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు : ఎమ్మెల్యే

మడకశిరటౌన్, సెప్టెంబరు 17 : నియోజకవర్గంలో సాగుచేసిన ప్రతి పంటకు ఈ-క్రాప్ నమోదు చేయాలని, ఏ ఒక్క రైతు నుంచి కూడా పంట నమోదు చేయలేదన్న మాట రాకూడదని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తెలిపారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామితో కలిసి ఆయన మంగళవారం పట్టణంలోని యాదవ భవనంలో వ్యవసాయ, పట్టుపరిశ్రమ, ఉద్యాన అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. కొంత మంది రైతులు వర్షాభావ పరిస్థితుల వల్ల సకాలంలో పంట సాగు చేయలేకపోయారని, అలాంటి రైతులకు ప్రత్యామ్నాయ విత్తనాలు అందించాలన్నారు. పట్టు సాగులో నియోజకవర్గం వెనుకబడి ఉందని, దీనిపై దృష్టి పెట్టి సాగు విస్తీర్ణాన్ని పెంచాలన్నారు. పీఎం ఆవాస్ యోజన పథకం కింద మంజూరైన గృహాలను పట్టణ సమీపంలోని పెద్దమ్మ గుడి వద్ద ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి అధికారులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, సాధికారత కన్వీనర్ పాండురంగప్ప, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఆర్అండ్‌బీ అతిథి గృహంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల పోలీసులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలో అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సరిహద్దు కర్ణాటక ప్రాంతంలో గట్టి నిఘా ఉంచాలని, అక్రమ ఇసుక, బియ్యం తరలింపులపై ఉక్కుపాదం మోపాలని తెలిపారు. అనంతరం ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. వేసవి ప్రారంభానికి ముందే తాగునీటి ఎద్దడి లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని, నియోజకవర్గంలో 60 కొత్త బోర్లు వేసి అన్ని గ్రామాల్లోనూ తాగునీటి సమస్య పరిష్కరించాలని తెలిపారు.


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ


మారుతీనగర్‌లో ఏర్పాటు చేసి నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం


ప్రత్యేక అకర్షణగా నిలిచిన శివాపురం 25 తలల వినాయకుడు

కోలాహలంగా వినాయక నిమజ్జనం

మడకశిర టౌన్, సెప్టెంబరు 17: పట్టణంలో మంగళవారం రాత్రి వినాయక నిమజ్జన కార్యక్రమం యువత కేరింతలు, కోలాహలంగా సాగింది. పట్టణంలో మారుతీనగర్, సదాశివాపురం, డ్రైవర్స్ కాలనీ, గాంధీబజార్, సాయినగర్, ఎన్‌టీఆర్ సర్కిల్‌తో పాటు దాదాపు 16 చోట్ల వినాయక నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. అర్బన్ సీఐ రామారావు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. యువత ఆనందోత్సవాల్లో మునిగి తేలారు. శివాపురం వద్ద ఏర్పాటు చేసిన 25 తలల వినాయకుడు ప్రత్యేక ఆకర్షణ నిలిచాడు.


నిమజ్జన కోలాహలం

వైభవంగా మారెమ్మ దేవత ఉత్సవాలు


హారతులు మోస్తున్న మహిళలు

మడకశిర (అమరాపురం), సెప్టెంబరు 17 : అమరాపురం మండల పరిధిలోని కెంకెర గ్రామంలో మంగళవారం మారెమ్మ దేవత ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోవీకాలనీ అమ్మవారి దేవాలయం నుంచి ఉత్సవ మూర్తిని ప్రత్యేక అలంకరణ చేసి మేళ తాళాలతో గ్రామ సమీపంలో ఉన్న బన్నీ చెట్టు వరకు ఊరేగించారు. ప్రతి ఇంటి నుంచి మహిళలు అమ్మవారికి జ్యోతుల ఉత్సవాలను నిర్వహించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు : ఎస్‌ఐ

హిందూపురం(సోమందేపల్లి), సెప్టెంబరు 17 : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ రమేష్ హెచ్చరించారు. మంగళవారం ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఇష్టానుసారంగా వెళ్తున్న వాహనదారులను పిలిపించి హెచ్చరికలు జారీచేశారు. అనంతరం గీతానగర్‌వద్ద ఉన్న వైన్‌షాపు పరిసరాలను పరిశీలించారు. వీధుల్లో ఎక్కడబడితే అక్కడ మందు సీసాలు ఇళ్లవద్ద పారబోయడాన్ని గమనించిన ఎస్‌ఐ మందుబాబులను తీవ్రంగా హెచ్చరించారు. ఇళ్లమధ్యలో మద్యం సేవించినా, మహిళలను ఇబ్బందికి గురిచేసినా తాటతీస్తానని హెచ్చరించారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

అగళి, సెప్టెంబరు 17: మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో జడ్పీటీసీ సభ్యుడు ఉమేష్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 155 మంది కంటి పరీక్షలు చేయించుకోగా 120మంది కంటి ఆపరేషన్‌కు ఎంపికయ్యారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజగోపాల్, కృష్ణప్ప, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్ల పంపిణీ

మడకశిర రూరల్, సెప్టెంబరు 17: మండలంలో బుళ్లసముద్రం ఉన్నత పాఠశాలలో స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. దాతలు ఇచ్చిన రూ.15 వేల విరాళంతో ప్రధానోపాధ్యాయుడు విశ్వనాథ్ పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లు కొనుగోలు చేసి పంపిణీ చేశారు. మంగళవారం మాజీ సర్పంచు జైపాల్ వాటిని విద్యార్థులకు పంపిణీ చేశారు.

నులిపురుగుల నివారణపై అవగాహన

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మంగళవారం సోమందేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆల్బెండజోల్ మాత్రలను అందజేశారు. వైద్యుడు ఓంకార్ మాట్లాడుతూ నులిపురుగులు ఎలా పెరుగుతాయి, వాటి నుంచి ఆరోగ్యం ఎలా కాపాడుకోవాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. గోరంట్ల మండల వ్యాప్తంగా 19 యేళ్ల వయస్సులోపు ఉన్న విద్యార్థులందరికి ప్రభుత్వ అధికారులు, వైద్య సిబ్బంది ఆల్‌బెండోజోల్ మాత్రలు మింగించారు. గోరంట్ల వైద్యాధికారి శృతి ఆధ్వర్యంలో ఎంపీడీఓ రఘునాథ్‌గుప్త ఎమ్మార్సీ ప్రాథమిక పాఠశాలలో ప్రారంభించారు. అగళి మండలంలోని అన్ని పాఠశాలలోనూ వైద్య సిబ్బంది సందర్శించి మొత్తం 5,864 మంది విద్యార్థులు ఉండగా అందులో 5,672 మందికి అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు డాక్టర్ శివానంద తెలిపారు. పెనుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సుదర్శన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు.



సోమందేపల్లిలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు, గోరంట్ల ఎమ్మార్సీలో విద్యార్థులతో మాత్రలు మింగిస్తున్న ఎంపీడీఓ రఘునాథ్ గుప్తా

అనంత పద్మనాభస్వామికి పూజలు


అనంత పద్మనాభస్వామికి ప్రత్యేక అలంకరణ

పెనుకొండ, సెప్టెంబరు 17 : అనంత పద్మనాభస్వామి వ్రతాలను పట్టణంలో పలువురు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గృహాలలో మామిడాకులు, అరటి పిలకలతో మండపాలను అలంకరించి అనంత పద్మనాభస్వామిని ఏర్పాటుచేసి వివిధ రకాల పూలతో పూజలు చేశారు. అనంతరం చేతికి అనంత ధారాలను ధరించారు.

దుకాణంలో చోరీ


దుకాణంపై రేకులు తొలగించిన దృశ్యం

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 17: పట్టణంలోని చిల్లర దుకాణంలో చోరీ జరిగిన సంఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. బాధితుడు జబీవుల్లా అందించిన వివరాల మేరకు.. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా చిల్లర అంగడి నిర్వహిస్తున్నానని తెలిపారు. వ్యాపారం ముగించుకుని తాళాలు వేసి వెళ్లానని మంగళవారం ఉదయం వచ్చి చూడగా షాపు చిందరవందరగా పడి ఉందన్నారు. రేకులు తొలగించి షాపులోకి జొరబడి చోరీ చేసినట్లు తెలిపారు. రూ.7వేలు నగదు, రూ.25వేలు విలువచేసే సరుకులు ఎత్తుకెళ్లినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పథకాలను వినియోగించుకోండి

కియ సీనియర్ మేనేజర్ శ్రీనివాసరావు


సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 17 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను ఎంఎస్ఎంఈలు వినియోగించుకోవాలని కియా లిమిటెడ్ సీనియర్ మేనేజర్ శ్రీనివాసరావు వెల్లడించారు. మంగళవారం పెనుకొండ మండలంలోని మునిమడుగు సమీపంలోని మోబిస్ ఇండియా మాడ్యూయల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో జనరల్ మేనేజర్, డీజీసీ చాంద్ బాషా, నేషనల్ కౌన్సిల్ ప్రొడక్టివిటి కౌన్సిల్ డిప్యూటీ డైరెక్టర్ సంజన్న సిబ్బందికి అవగాహన కల్పించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 17: మండలంలోని గుట్టూరు సమీపంలో 44వ జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కొత్తకోట అంజనేయులు (55) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కియా ఏఎస్ఐ వెంకటరమణ తెలిపారు. సోమందేపల్లి మండలం వెంకటంపల్లికి చెందిన కొత్తకోట అంజనేయులు సెక్యూరిటీ గార్డ్ పనికోసం సోమవారం మక్కాజిపల్లికి వచ్చాడు. ఈ క్రమంలో ద్విచక్రవాహనంలో హైవేపైకి వస్తుండగా అనంతపురం నుంచి పెనుకొండకు వెళ్లే మరో ద్విచక్ర వాహనదారుడు ఢీకొన్నట్లు తెలిపారు. ప్రమాదంలో ఆంజనేయులు తీవ్రంగా గాయపడ్డాడు. హుటాహుటిన పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కర్నూలు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు.

దుకాణాల్లో తూనికలు, కొలతల అధికారి తనిఖీలు

హిందూపురం(సోమందేపల్లి), సెప్టెంబరు 17 : సోమందేపల్లిలో మంగళవారం తూనికలు, కొలతల అధికారి శివశంకర్ ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. పలు కిరాణా దుకాణాల్లో తూకం చేసే యంత్రాలను పరిశీలించారు. బియ్యం ప్యాకెట్లను పరిశీలించి వాటి బరువును కొలిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కిరాణా, ప్రభుత్వ పౌరసరఫరాల దుకాణాల్లో తూకాల్లో మోసానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. 25 కిలోల బియ్యం ప్యాకెట్ 26 కిలోలు ఉండాలని అలాకాకుండా 23, 24 కిలోలు తగ్గించి అమ్మినా కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ దిశలో అధికారి రాకను గమనించిన పలుషాపుల యజమానులు పరారయ్యారు. శివశంకర్ మాట్లాడుతూ ఎవరైనా తూనికలు, కొలతల్లో మోసానికి పాల్పడితే సమాచారం అందించాలని కోరారు.

జనంమెచ్చిన నేత మోదీ

హిందూపురం, సెప్టెంబరు 17 : దేశ ప్రజలు మెచ్చిన నేత ప్రధాని నరేంద్ర మోదీ అని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వరప్రసాద్ అన్నారు. మోదీ జన్మదినం సందర్భంగా మంగళవారం పట్టణంలోని పలుచోట్ల ఆలయాల్లో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ఆరోగ్యంగా ఉండాలని భగవంతుడిని పూజించామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రమేష్‌రెడ్డి, ఆదర్శ్, శంకర్, భాగ్యలక్ష్మీ, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గృహాలను ప్రారంభించిన ఎంపీ


గృహాలను ప్రారంభిస్తున్న బీకే పార్థసారథి

పెనుకొండ, సెప్టెంబరు 17 : పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీ సమీపంలో నిర్మించిన ప్రధానమంత్రి ఆవాజ్‌యోజన గ్రామీణ అర్బన్ గృహాలను హిందూపురం పార్లమెంట్ సభ్యుడు బీకే పార్థసారథి మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన అధికారులతో మాట్లాడుతూ కాలనీలో ఇళ్ల నిర్మాణాలు, సంఖ్య, నిర్మాణానికి అయిన ఖర్చు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రధాని నరేంద్రమోదీ 74వ జన్మదినం పురస్కరించుకుని కేక్‌కట్‌చేసి బీజేపీ నాయకులకు తినిపించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివశంకరప్ప, తహసీల్దార్ శ్రీధర్, హౌసింగ్ ఏఈ శ్రీనాథ్, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి కుటుంబానికి పరామర్శ

పెనుకొండ రూరల్ : రొద్దం మండలం గోనిమేకలపల్లిలో టీడీపీ సీనియర్ నాయకుడు మాల జయరామప్ప భార్య అనారోగ్యంతో మృతిచెందగా విషయం తెలుసుకున్న ఎంపీ బీకే పార్థసారథి గ్రామానికి చేరుకుని మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపం వ్యక్తం చేశారు. టీడీపీ నాయకుడు వెంకటేశ్వర్‌రావు గోనిమేకలపల్లికి చేరుకుని మృతదేహానికి నివాళులు అర్పించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా మలుచుకుందామని సోమందేపల్లి ఎంపీడీఓ సరస్వతి తెలిపారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి విద్యార్థులతో ర్యాలీని ప్రారంభించారు. సర్పంచ్ గంగాదేవి ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా పురవీధుల్లో ర్యాలీగా వెళ్లి ఎన్టీఆర్ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు, నాయకులతో ప్రమాణం చేయించారు. హిందూపురంలోని పలు వార్డుల్లో స్వచ్ఛత హి సేవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంజీఎం పాఠశాల వద్ద విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. గోరంట్ల మండలంలోని అన్ని పంచాయతీ కేంద్రాల్లో స్వచ్ఛతహీసేవా కార్యక్రమంలో కార్యదర్శులు విద్యార్థులచే ర్యాలీలు నిర్వహించారు. అమరాపురం, అగళి మండలాల్లో ర్యాలీలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు.

గోనిపేటలో సెల్‌టవర్ ఏర్పాటు చేయండి


ఏటీఓకు వినతిపత్రం అందిస్తున్న జేవీవీ నాయకులు

పెనుకొండ, సెప్టెంబరు 17 : మండలంలోని గోనిపేట గ్రామంలో సెల్ సిగ్నల్స్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే టవర్ ఏర్పాటు చేయాలని కోరుతూ జనవిజ్ఞాన వేదిక నాయకులు జేటీఓకు వినతి పత్రం అందించారు. మంగళవారం జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి హరి ఆధ్వర్యంలో గోనిపేట గ్రామస్థులు జేటీఓ ఉమాప్రసాద్‌కు వినతి పత్రం అందించారు. గోనిపేట గ్రామంలో దాదాపు రెండు వేల మంది జనాభా ఉన్నారని, వ్యవసాయ కూలీలు, భవన నిర్మాణ కార్మికులు, ఆటో కార్మికులు, ఉద్యోగులు, ప్రతిరోజూ పెనుకొండకు వస్తుంటారని సిగ్నల్స్‌లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో జేవీవీ సభ్యులు రవి, వెంకటేశ్వర్లు, వెంకటేశ్, ఆది, అశ్వర్థ, నాగరాజు పాల్గొన్నారు.

ఘనంగా బండారు బాలాజీ జన్మదిన వేడుకలు


బండారు బాలాజీని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

హిందూపురం, సెప్టెంబరు 17 : ఎన్‌బీకే ఫ్యాన్స్ టౌన్‌వైడ్ ప్రెసిడెంట్ బండారు బాలాజీ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని సప్తగిరి రెసిడెన్సియల్‌లో మంగళవారం టీడీపీ నాయకులు, నందమూరి బాలకృష్ణ అభిమానులు బాలాజీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పీఏ బాలాజీ, హెచ్‌ఎన్ రాము, ప్రెస్‌వెంకటేశ్, ఆర్‌ఎంఎస్ షఫీ, నారాయణస్వామి, శ్రీనివాసులు, ఆది, సింగిరెడ్డిపల్లి బాబా, ఆనంద్, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వివక్షపై దళితుల ఆగ్రహం


అధికారుల సమక్షంలో రాజీపడిన దళితులు, అగ్రవర్ణాల నాయకులు

పావగడ, సెప్టెంబరు 17 : తాలూకా పరిధిలోని బీకేహళ్లిలో గణేష్ నిమజ్జనానికి తరలి వెళ్తున్న దళిత నాయకులను అగ్రవర్ణాలకు చెందినవారు తమ దారిలో సంచరించకూడదంటూ అడ్డుకున్న ఘటన మంగళవారం చోటుచేసుకుంది. దీంతో ఆగ్రహించిన దళితులు తమకు న్యాయం జరిగే వరకు కదిలేది లేదని ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న మధుగిరి డీఎస్పీ రామచంద్రప్ప, సీఐ సురేష్, తిరుమణి ఎస్ఐ లక్ష్మణ్, తహసీల్దార్ వరదరాజు గ్రామానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ప్రస్తుత కాలంలో రాజ్యాంగ నిబంధనల ప్రకారం అందరూ ఒక్కటేనని, కుల వివక్ష చట్టం ప్రకారం నేరమని, అలా వ్యక్తిని నిందిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించడంతో అగ్రవర్ణాలవారు మెత్తబడ్డారు. ఈ సందర్భంగా దళిత నాయకులు తిప్పేస్వామి, పెద్దన్న, మంజునాథ్, అనేక మంది తరలివెళ్లి అధికారులతో చర్చించారు. అధికారులు ఇరువర్గాలతో చర్చలు జరిపి ఆందోళనను విరమింపజేశారు.


అమడగూరు బస్టాండ్ ప్రాంతంలో మానవహారం


గాండ్లపెంటలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం


కొండకమర్లలో ర్యాలీ


తనకల్లులో ర్యాలీ


ఉప్పునేసినపల్లిలో...


తాడిమర్రిలో ...


ముదిగుబ్బలో ప్రతిజ్ఞ చేస్తున్న కూటమి నాయకులు

ఊరువాడా 'స్వచ్ఛతాహి సేవ'

స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని కదిరి, ధర్మవరం, పుట్టపర్తి నియోజకర్గాల్లో మంగళవారం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రాల్లోని కూడళ్ల వద్ద మానవహారం నిర్వహించారు. స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలు అక్టోబరు 2వరకు జరుగుతాయని వక్తలు తెలిపారు. ప్రజలందరూ వ్యక్తిగత, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వారు పిలుపునిచ్చారు. కొన్ని ప్రాంతాల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. పారిశుధ్య కార్మికులకు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి బీపీ, షుగర్, రక్తపరీక్షలు నిర్వహించారు.

- న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి


అమగొండపాళ్యంలో నిర్వహిస్తున్న వైద్యశిబిరం

మద్యం పట్టివేత

కదిరి(అమడగూరు), సెప్టెంబరు17: మండలంలోని వెంకటనారాయణపల్లి క్రాస్ వద్ద కర్ణాటక నుంచి అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సీఐ నరేంద్రరెడ్డి మంగళవారం తెలిపారు. వాహనాల తనిఖీలో భాగంగా కదిరి పట్టణంలోని నిజాంవలీ కాలనీకి చెందిన షేక్ బాబావలీ ఆటోలో అక్రమంగా మద్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. 192 ఫైవార్ట్స్ 90ఎంఎల్ టెట్రా ప్యాకెట్లు, 96 ఓల్డు అడ్మిరల్ 180 ఎంఎల్ ప్యాకెట్లు, ఒక లీటర్ బ్రాందీ బాటిల్స్ 9 పట్టుకున్నామన్నారు. నిందితుడిని రిమాండ్‌కు పంపామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటనారాయణ, హెడ్‌కానిస్టేబుల్ సూర్యనారాయణ, కానిస్టేబుల్ జేబీవుల్లా, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పాఠశాలకు ట్యాంక్ వితరణ

బుక్కపట్నం, సెప్టెంబరు 17: మండల కేంద్రంలోని డిపెప్ పాఠశాలకు జనసేన నాయకులు వాటర్ ట్యాంక్‌ను మంగళవారం వితరణ చేశారు. జనసేన టౌన్ కన్వీనర్ దాసరి శ్రీనివాసులు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన సమయంలో తాగునీటికి విద్యార్థులు ఇబ్బందులు పడుతుంటే గుర్తించి, సమస్యను పరిష్కరించామన్నారు. వారికి ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టైలర్ శివప్రసాద్ విలేకరి శ్రీరాములు, నాగభూషణ, బాలాజీ, రాము, శీనా తదితరులున్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం: పల్లె


మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

ఓబుళదేవర చెరువు, సెప్టెంబరు 17: కష్టాలో ఉన్న ప్రతి కార్యకర్త కుటుంబానికి తాము ఎప్పుడు అండగా ఉంటామని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని వేమారెడ్డిపల్లికి చెందిన టీడీపీ నాయకుడు పీట్ల నాగరాజు కుమారుడు పీట్ల మహేష్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి మృత దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి, నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆర్థికసాయం అందచేశారు. ఇటీవలే మండలకేంద్రానికి చెందిన హమాలి శ్రీనివాసులు మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించి, మృతుడి భార్య శివమ్మకు ఆర్థికసాయం అందించారు. ఇంకా ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పిట్టా ఓబులరెడ్డి, కన్వీనర్ శెట్టివారి జయచంద్ర, ప్రధాన కార్యదర్శి పీట్ల సుధాకర్, రాష్ట్ర బీసీసెల్ నాయకలు జెరిపిటి ఆంజనప్ప, కందుకూరిపల్లి కృష్ణమూర్తి, మండోజీ ఆర్ఫీఖాన్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు

కొత్తచెరువు, సెప్టెంబరు 17: స్థానిక బాలుర ఉన్నతపాఠశాలలో పనిచేస్తున్న గణిత టీచర్ గోవిందనాయక్ విధులకు సరిగా రావడం లేదని టీడీపీ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డికి ఫిర్యాదుచేశారు. మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేకు టీడీపీ నాయకులు సాలక్కగారి శ్రీనివాసులు, ఒలిపిశీన, నల్లమాడ శంకర్, విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై డీఈఓ మీనాక్షికి ఫిర్యాదు చేయడానికి వెళ్తే ఆమె సరిగా స్పందించలేదని తెలిపారు. ఇలాంటి వారిపై తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఉపాధ్యాయుడు గోవిందనాయక్ పాఠశాలకు హాజరు కాకుండా సెలవులపై వెళ్లడం, మధ్యలో హాజరు కావడం, మరలా సెలవుపై వెళ్లడం, ఒకవేళ పాఠశాలకు వచ్చిన బయట తిరుగుతూ తరగతి గదులకు వెళ్లకుండా ఉంటాడని, దీనితో విద్యార్థులు నష్టపోతున్నార న్నారు.

విద్యార్థులు కొత్త ఆలోచనతో ముందుకెళ్లాలి

ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం రోజురోజుకు పెంపొందుతోందని కావున విద్యార్థులు చదువుతోపాటు కొత్తఆలోచనలతో ముందుకు వెళ్లాలని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి సూచించారు. విద్యార్థులు పాఠశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులు సైన్స్ పట్ల మక్కువ చూపాలన్నారు.అనంతరం పాఠశాల ప్రాంగణంలో అధికారులు,నాయకులు చీపురు పట్టి శుభ్రం చేశారు. ఉపాధ్యాయులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, శంకర, పెద్దన్న, సర్పంచ్ రాధా, ఎంపీడీఓ బారాన్‌సాబ్, ఎంఈఓ జయచంద్ర,మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

శాంతిభద్రతలు కాపాడండి: ఎస్పీ



డీపీఓలో జిల్లా ఎస్పీ రత్నకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కదిరి డీఎస్పీ శివనారాయణ

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 17: సబ్‌డివిజన్ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కల్గకుండా చర్యలు తీసుకోవాలని కదిరి నూతన డీఎస్పీ శివన్నారాయణకు జిల్లా ఎస్పీ రత్న సూచించారు. మంగళవారం కదిరి సబ్‌డివిజన్ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన శివన్నారాయణ స్థానిక జిల్లా పోలీసుకార్యాలయంలో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ సబ్‌డివిజన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేవిధంగా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని డీఎస్పీని ఆదేశించారు.

ఉద్యోగాలకు 110 మంది ఎంపిక

పుట్టపర్తి, సెప్టెంబరు 17: స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో అమర్‌రాజా బ్యాటరీస్ కంపెనీ నిర్వహించిన జాబ్‌మేళాలో 110 మంది కొలువులు సాధించారు. స్థానిక ప్రశాంతిగ్రామంలో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కంపెనీ ప్రతినిధులు కళ్యాణ్, చిట్టిబాబు, చంద్రశేఖర్ మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. 165 మంది ఇంటర్వ్యూలకు హాజరుకాగా 110 మంది ఉద్యోగాలు సాధించారు. ఈసందర్భంగా నిరుద్యోగ యువత మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి

పుట్టపర్తి, సెప్టెంబరు 17: విశ్వకర్మ జయంతిని మంగళవారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ సృష్టికర్త బ్రహ్మ అయితే విశ్వకర్మ సమాజాన్ని తయారు చేశారన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖాధికారి నిర్మలాజ్యోతి, విశ్వబ్రాహ్మణులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలు తొలగించకపోతే చర్యలు తప్పవు

నంబులపూలకుంట, సెప్టెంబరు 17: మండలకేంద్రంలోని పంచాయతీ కార్యాలయం సమీపంలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను తొలగించకపోతే చర్యలు తప్పవని ఎంపీడీఓ మనోహర్‌బాబు సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలకు మూడురోలు సెలవులు రావడంతో నిర్మాణాలు చేపట్టారన్నారు. మంగళవారం ఆయన అక్రమ కట్టడాలను పరిశీలించారు. వెంటనే అక్రమ కట్టడాలు తొలగించకపోతే తాము ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తామని హెచ్చరించారు. ఆయన వెంట కార్యదర్శి రమేష్‌నాయుడు, సర్వేయర్ ఉపేంద్ర తదితరులున్నారు.

ఘనంగా శ్రీగిరి ప్రదక్షిణ


శ్రీగిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్న సత్యసాయి భక్తులు

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 17: శ్రీసత్యసాయి శ్రీగిరి ప్రదక్షిణను మంగళవారం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ప్రశాంతి నిలయం గణేష్ గేట్‌వద్ద సత్యసాయి రథానికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. అనంతరం సత్యసాయి భక్తిగీతాలు ఆలపిస్తూ రథాన్ని లాగుతూ గిరి ప్రదక్షిణ నిర్వహించారు. గోకులం, గణేష్ కూడలి, పెట్రోలు బంకు, చింతతోపు, గోవిందపేట, శివాలయం వీధి, సత్యమ్మ ఆలయం, గోపురం మీదుగా తిరిగి గణేష్‌గేట్ వద్దకు చేరుకుంది.

యువకుడి ఆత్మహత్య


భార్గవ (ఫైల్‌ఫొటో)

కొత్తచెరువు, సెప్టెంబరు 17: మండల కేంద్రంలోని పాత తహసీల్దార్ కార్యాలయం వద్ద రామకృష్ణ కుమారుడు భార్గవ (30) తన ఇంటిలో ఉరి వేసుకుని మృతి చెందిన సంఘటన మంగళవారం వెలుగు చూసింది. సీఐ ఇందిర తెలిపిన మేరకు..కుటుంబ కలహాలతో భార్గవ సోమవారం రాత్రి ఇంటిలో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. చుట్టు పక్కల ఇళ్ల వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.